విశాలాంధ్ర
అల్లూరి సీతారామరాజు
పేజి నెం. 7
శుక్రవారం 21, జూన్ 2024

అర్ధాంతరంగా నిలిచిన పాఠశాల నిర్మాణ పనులు

- పూర్తికాని నాడు-నేడు మరమ్మత్తులు...
- అవస్థలు పడుతున్న విద్యార్థులు

విశాలాంధ్ర-చింతపల్లి: నాడు-నేడు పథకంతో విద్యాలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ప్రకటించిన వైకాపా ప్రభుత్వం, మండలంలోని కొత్తపాలెం పంచాయతీ కడశిల్ప గ్రామంలో పాఠశాల నిర్మాణపనులను గుత్తేదారుడు అర్ధాంతరంగా నిలిపివేయడంతో విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని పరిస్థితి దాపురించిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయంలో సంబంధిత గుత్తేదారులు పాఠశాల భవనాన్ని నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా విడిచి పెట్టడంతో గ్రామంలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. స్లాబ్‌తో ఉన్న ఈ పాఠశాల భవనాన్ని నాడు నేడు పేరిట సుమారు రూ.12 లక్షల నిధులు విడుదలచేసి అభివృద్ధిపరిచేందుకు పనులు ప్రారంభించిన గుత్తేదారుడు పాఠశాల భవనానికి రేకులు వేసి మిగిలిన మరమ్మత్తు పనులను గాలికి వదిలేయడంతో ఆ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. నాడు పాఠశాలగా ఉన్న ఈ భవనం నేడు లక్షల రూపాయల నిధులతో సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నాడు-నేడు పథకంలో విడుదలైన నిధులతో ఉన్న స్లాబ్‌ను తీసేసి, కేవలం రేకులు మాత్రమేవేసి మిగిలిన మరమ్మత్తు పనులను పూర్తిచేయకుండా మమ అనిపించారని ఈ ప్రాంతీయులు ఆరోపిస్తున్నారు. ఈసమస్యపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే పాఠశాల నిర్మాణపనులు పూర్తి చేయాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

ముగ్గురికి తీవ్ర గాయాలు... ఒకరి పరిస్థితి విషమం

విశాలాంధ్ర - చింతపల్లి : రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆ ముగ్గురిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవ నిమిత్తం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమికంగా అందిన సమాచారం ప్రకారం జీ కే వీధి మండలం మెండిగెడ్డ ప్రధాన రహదారి మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. చింతపల్లి మండలం బలపం పంచాయితీ మూలకొత్తూరు గ్రామానికి చెందిన వంతల కొండబాబు (35) ఒక ద్విచక్ర వాహనంపై, అదే మండలం తమ్మంగుల పంచాయతీకి చెందిన సురేష్, వంతల సైతలు మరో వాహనంపై ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చసుకుందని క్షతగాత్రులను చింతపల్లి ఆసుపత్రికి తరలించగా క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, వారిలో పరిస్థితి విషమంగా ఉన్న వంతల కొండబాబును మరింత మెరుగైన వైద్య సేవ నిమిత్తం పాడేరు ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. మిగిలిన ఇరువురికి చింతపల్లిలోనే వైద్యులు, వైద్య సేవలు అందించారు.

హోరాహోరీగా వారపు సంత వేలం పాట

విశాలాంధ్ర -ముంచంగిపుట్టు... మండల కేంద్రంలో శనివారం జరిగే వారపు సంత వేలం పాట హోరాహోరీగా సాగింది. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఎంపీడీవో కె.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో కించాయిపుట్టు పంచాయితీ కార్యదర్శి గోపి అధ్యక్షతన జరిగిన వారపు సంత వేలం పాటలో 11 మంది పాటాదారులు డిపాజిట్ చేసుకుని పాల్గొన్నారు. వేలం పాట ప్రారంభం కాగా తొలుత పంచాయతీ కార్యదర్శి రూ.80 వేల రూపాయిలతో పాటను ప్రారంభించారు అనంతరం 11 మంది పాటదారులతో హెరాహెరీగా వేలం పాట కొనసాగింది. సంత వేలంపాట చివరగా దూరు భాస్కర్‌రావు రూ.రెండు లక్షల ఐదు వేల రెండువందల రూపాయిలకు పాట పాడగా, దానికి అధిగమించి కించాయిపుట్టు పంచాయితీ కించాయిపుట్టు గ్రామానికి చెందిన రోబ్బ గణపతి రూ.రెండులక్షల ఐదు వేల మూడు వందల రూపాయిలు పాటను పాడి వేలం పాటను దక్కించుకున్నారు. అనంతరం ఎంపిడిఓ కిరణ్ కుమార్ వారపు సంతలో ఆశీలు వసూలు చేసే విధి విధానాలపై వేలం పాటదారుడికి వివరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ఈ ఏడాది వేలంపాట నెలల కాలపరిమితి నిర్ణయించబడిందని, నిబందల ప్రకారమే ఆశీలు వసూలు చేయాలని, విరుద్ధంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని, వ్యాపారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుభాష్ చంద్ర, ఈవోపీఆర్డీ వి.చిన్నాన్న, ఎంపిడిఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్, సతీష్, జూనియర్ అసిస్టెంట్ వెంకటరమణ, డిపాజిట్‌దారులు, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ...

విశాలాంధ్ర-మారేడుమిల్లి : మండలంలోని డివి కోట రైతు భరోసా కేంద్రంలో 2024 జూన్ ఖరీఫ్ సీజన్ రావడం వలన నూతనంగా ఏర్పడినటువంటి తెలుగుదేశం ప్రభుత్వం ముందస్తుగానే రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణిని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ కే.వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గురుకు శేష్‌కుమార్, మాజీ మండల అధ్యక్షులు బి. అప్పాజీ, జనసేన మండల అధ్యక్షులు మల్ల దుర్గాప్రసాద్, మండల ఉపాధ్యక్షులు కర్రీ సన్యాసి రెడ్డి, మండల కార్యదర్శి కట్రం సోమరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సున్నంపాడు పంచాయతీ సున్నంపాడు రైతు భరోసా కేంద్రంలో 2024 ఖరీఫ్ సీజన్ కి రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మారేడుమిల్లి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు, యూనిట్ ఇంచార్జ్ అందాల సూర్యనారాయణ రెడ్డి, మాజీ సర్పంచులు కంగలకన్నపుదొర, పోడియం కన్నపుదొర, వార్డ్ మెంబర్ కంగల నూకలమ్మ, సీనియర్ కార్యకర్తలు కురసం బాపన్న దొర, కుంజాం సత్తిబాబు సత్తిబాబు, కంగల బుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధులపట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవు

- ఐటీడీఏ పీవో అభిషేక్
- ఐటిడిఏ పిఓ ఉపాధ్యాయ అవతారం
- గుంటసీమ హెచ్ఎంకు షోకాజ్ నోటీసు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వహించాలని విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని పాడేరు ఐటిడిఏ పిఓ, వి అభిషేక్ హెచ్చరించారు. గురువారం గుంటసీమ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. విద్యార్థుల హాజరు పట్టీలను పరిశీలించారు. ఎంత మంది పాఠశాలకు రావడం లేదని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.కోగేశ్వరరావు విధులకు గైర్హాజరవడంతో ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మొత్తం ఎంత మంది ఉండాలి? ఎంత మంది హాజరు కాలేదని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. సికిల్ సెల్ ఎనిమియా లక్షణాలు ఉన్న విద్యార్థులు ఉన్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తలిదండ్రులు సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ప్రతీ విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. పది తరువాత ఏం చదువుతారని విద్యార్థులను ప్రశించారు. ఇంటర్మీడియట్ చదువుతామని విద్యార్థులు జవాబిచ్చారు. ఆతరువాత డిగ్రీలో చేరి బాగా చదువుకోవాలని చెప్పారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులకు జాగ్రఫీ పాఠ్యాంశాలను బోధించారు. సాంఘిక శాస్త్రంలో పాఠాలు బోధించి పాఠ్యాంశంలోని ప్రశ్నలు వేసి జవాబులు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో మాట్లాడి ప్రతీ విద్యార్థి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రతీ విద్యార్థి పాఠశాలలోనే ఉండాలన్నారు. అనంతరం నందివలస బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. 10 వతరగతిలో ఎంత మంది విద్యార్థులున్నారని అడిగి తెలుసు కున్నారు. పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని స్పష్టం చేసారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని చెప్పారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఇంటిపై పడ్డ చెట్టు

విశాలాంధ్ర-సీలేరు... జీకేవీధి మండలం సీలేరులో గురువారం సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులకు భారీ వేప చెట్టు ఓ ఇంటిపై పడింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సీలేరులో గల బాలాజీ రెస్టారెండ్ వెనుక వీధిలో గల రాజేంద్ర అనే గిరిజనుడి ఇంటి ముందు భారీ వేప చెట్టు గురువారం సాయంత్రం వీచిన గాలులకు పడిపోయిది. గాలులు వీయడగంతో ఇంట్లో ఉన్న వారంతా ఇంటి బయటకు వచ్చేసారు. ఇదే సమయంలో చెట్టు ఇంటిపై కూలీ ఇంటి పై కప్పు రేకులు ధ్వంసమయ్యాయి. చెట్టు కూలిన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో ఉండి ఉంటే పెను ప్రమాదం సంబంధించి ఉండేదని రాజేంద్ర కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

వ్యవసాయ రైతులకు వరి విత్తనాలు పంపిణీ

గొందిపాకల సర్పంచ్ వరలక్ష్మి

విశాలాంధ్ర -చింతపల్లి:రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న విత్తనాలను గిరి రైతులు సద్వినియోగం చేసుకోవాలని గొంది పాటల సర్పంచ్ సాగిన వరలక్ష్మి అన్నారు. గొందిపాకల సచివాలయం అగ్రికల్చర్ అసిస్టెంట్ శోభన్‌బాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కుమ్మరి పూర్ణచంద్రరావుతో కలిసి గిరి రైతులకు గురువారం ఆమె విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయ పరంగా ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఈ సీజన్‌లో గిరి రైతులకు అనేకరకాల ఉత్పత్తులైన విత్తనాలు పంపిణీ చేసేందుకు తెదేపా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో తెదేపా నాయకులు రొబ్బ యశ్వంత్, గ్రామపెద్దలు బౌడు కుశలవుడు, బౌడు చిట్టిబాబు, బౌడు సత్యనారాయణ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు 70 డెస్క్‌లను అందించిన ఓఎన్‌జిసి

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి జిల్లాపరిషత్ హైస్కూల్ కి పూర్వ విద్యార్థుల సహకారంతో ఓఎన్ జిసి వారు 70 డెస్క్ లను అందజేశారు, వీటి విలువ 5.60 లక్ష లని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎన్ జిసి ఆడికారుల బృందం, ఇదే పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు, చీడిపల్లి అప్పారావు,దాట్ల శివాజీ,బివిఎస్ఎన్ గుప్త, బుంగరాజ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ఇప్పుడు చదువుతున్న విద్యార్థులు మరింత శ్రద్ధ కనబరిచి పాఠశాలకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని, దీంతో దాతలు మరింత ముందుకు వస్తారని తెలిపారు.

విశాలాంధ్ర
పార్వతీపురం మన్యం

నేను బడికి పోతా కార్యక్రమం విజయవంతం చేయండి

హెచ్ఎంల సమావేశంలో ఎంపిడిఓ, ఎంఈవోల పిలుపు

విశాలాంధ్ర-బెలగాం:నూతన విద్యాసంవత్సరంలో మండలంలోని పాఠశాలల్లో నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బలిజిపేట ఎంపిడిఓ రమేష్ నాయుడు, ఎంఈఓ 1 సామల సింహాచలంలు కోరారు. గురువారం బలిజిపేట ఎంపిడిఓ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వ హించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అన్ని కార్యక్రమాలను అన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ 1 సామల సింహాచలం మాట్లాడుతూ స్టూడెంట్ కిట్‌లను ప్రతి విద్యార్థికి పంపిణీచేసి అక్విటెన్స్‌లను అందజేయాలన్నారు. అదేవిధంగా రేపు అన్ని పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని నిర్వహించి ఫోటోలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధ్యాయులందరూ సమయ పాలన పాటించాలని, ఫేషియల్ అటెండెన్స్ ని తప్పనిసరిగా వేయాలన్నారు. యుడైస్ ను వెంటనే పూర్తి చేయాలన్నారు. విద్యా శాఖలో అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాల పేర్లను మార్పు చేయడం జరిగిందని వాటన్నిటినీ కూడా ఉపాధ్యాయులు గమనించి నూతన పేర్లను వినియోగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్ఎంటీలు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల ఉన్నత పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి : మంత్రి గుమ్మిడి

విశాలాంధ్ర-సాలూరు : పట్టణంలో ఉన్న బాలికల పాఠశాలను కళాశాలగా స్థాయి పెంచేందుకు కృషి చేస్తానని స్త్రీ శిశు సంక్షేమ,గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి.సంధ్యారాణి అన్నారు.గురువారం పట్టణంలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు.డిప్యూటీ డిఈఓ రాజ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెమలిపిట్ట జ్యోతి ఆధ్వర్యంలో సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల సిబ్బంది తో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి చెయ్యాలన్నారు. పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నిపుణులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో మాత్రమే లభిస్తారన్నారు. బాలికల పాఠశాలలో సుమారు 400 మంది విద్యార్థినులు విద్య అభ్యసిస్తున్నారన్నారు. వీరిలో ప్రతీ ఏటా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి 80 మంది వరకు విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివేందుకు వివిధ కళాశాలలలో చేరుతున్నారన్నారు. గతంలో బాలికల పాఠశాలకు వచ్చేటప్పుడు పాఠశాలను కళాశాలగా స్థాయిని పెంచి ఇంటర్మీడియట్ విద్యను అందించాలని విద్యార్థులు కోరారరన్నారు. వారి కోరిక మేరకు ఉన్నత పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే ఆదిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కళాశాల తరగతి గదుల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలికంగా తరగతుల నిర్వహణలకు అవసరమైన వసతితోపాటు ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది. చిట్టి, సాలూరు మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్, సీనియర్ నాయకులు కూనిశెట్టి భీమ, కరిబుగత భాస్కరరావు, ఆముజూరి శ్రీనివాసరావు, డబ్బికృష్ణ, బందాపు సతీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ పరిధిలో గల మల్లి ఆశ్రమ పాఠశాల లో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు కిట్ను ఐటిడిఏ. ఉప విద్యాశాఖాధికారి పి.నారాయుడు అందచేశారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు విద్యార్థులు వినియోగించుకొని ఉన్నతంగా చదువుకోవాలని ఆకాంక్షిమిచారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, నాణ్యమైన మెనూ అందించాలని, డిప్యూటీ ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఏవి శ్రీనివాసరావు, వార్డెన్ వీరేసు,ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'యస్ సొసైటీ' అధ్వర్యంలో...



కురుపాం : స్థానిక కురుపాం ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాటశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివన్నపేట విద్యార్థులకు యస్ సొసైటీ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో స్టడీ మెటీరియల్ డ్రాయింగ్ కిట్లు పంపిణీ చేశారు. దీని ద్వారా పిల్లలో సృజనాత్మకత పెంపొందించే విధంగా ఈ మెటీరియల్‌ను వినియోగించాలని యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ కోరారు. ముఖ్యంగా డ్రాయింగ్ బుక్స్, వాటర్ పెయింట్స్, కలర్ పెన్సిల్స్ ద్వారా పిల్లలకు చిత్ర లేఖనం నిర్వహించి పిల్లలకు చదువు పట్ల ఉత్సాహాన్ని పెంచే అవకాశం ఉందని ఆశ్రమ పాటశాల ప్రధాన ఉపాధ్యాయులు రామ గోవింద్, మల్లిపురం జగదీష్ అన్నారు. ముఖ్యంగా ఆదివాసీ బాలలో కొన్ని ప్రత్యేక నైపుణ్యాలు ఉంటాయని చిన్న చిన్న ప్రోత్సాహకాలు అందిస్తే వాళ్ళు అద్భుతాలు చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా పాటశాల పిల్లలు మరియు ఉపాధ్యాయులు యస్ సొసైటీ వారికి ధన్యవాదాలు తెలిపారు.

చెరువు, గెడ్డలపై ఆక్రమణలు తొలగింపు

- శ్రీకారం చుట్టిన అధికారులు
- రెడ్ బుక్‌లో మొదటిపేజీ తెరిచిన ఎమ్మెల్యే విజయచంద్ర
- ఆక్రమణదారుల్లో మొదలైన అలజడి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలో పదుల సంఖ్యలో చెరువులు,వరహాలగెడ్డ పరివాహక ప్రాంతంలోను వందల సంఖ్యలో ప్రభుత్వ స్థలాలను గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధికి అనుచరులైన వైసీపీ నాయకులు, కొంతమంది కౌన్సిల్ సభ్యులు భారీగా కబ్జాలు చేసినట్లు అనేక ఆరోపణలు వస్తున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఆరోపణలపై ప్రస్తుత శాసనసభ్యులు విజయచంద్ర దూకుడు పెంచారు. ఈ నేపథ్యంలో బుధవారం, గురువారం ఆయన పట్టణ పరిధిలోని పలు చెరువులను వరహాలగెడ్డ పరీవాహక ప్రాంతాన్ని, అక్రమ రియల్ ఎస్టేట్‌లను అధికారుల సమక్షంలో పర్యవేక్షించి అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ అక్రమ కట్టడాలపై చెరువులను బంధలను గెడ్డ పరీవాహక ప్రాంతాలను ఆక్రమించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని అనధికార కట్టడాలను కూల్చి వేయాలని అధికారు లకు ఆదేశించారు. ఈ తరుణంలో పట్టణ నడి బొడ్డున ఉన్న దేవుని బందలో వ్యక్తి ఆక్ర మించిన సర్వే నెం.343లో 30×40 అడుగుల స్థలంలో నిర్మించిన భవనాన్ని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర దగ్గరుండి అధికారులతో పెకిలింపజేశారు. గతంలో ఎన్నడూ చూడలేని అరాచకాలను, ఆక్రమణలను, కబ్జాలను వైసీపీ ప్రభుత్వ హయాంలో చూశామని, వీటికి చెక్కు పెట్టేందుకు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తీసుకున్న నిర్ణయం శభాష్ అని పట్టణంలో బహిరంగంగానే చర్చించుకోవడం విశేషం. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ పార్వతీపురం ప్రాంతంలో భూకబ్జాలు, చెరువులు, బందలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు హామీ ఇవ్వడం జరిగిందని ఆ హామీని తూచ తప్పకుండా పాటించడం నాబాధ్యత అని, గత ప్రభుత్వం చేసిన అన్యాయాలను అక్రమాలను రెడ్‌బుక్‌లో నోట్ చేయడం జరిగిందని ఇందులో ప్రథమంగా ఈరోజు మొదట పేజీని తెరిచి ఈ నిర్మాణాన్ని కూల్చివేయడం జరిగిందని అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం మిగతా అక్రమ నిర్మాణాలు ఆక్రమణలపై దశలవారీగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దీనితో పట్టణంలోని ఆక్రమణదారులల్లో అలజడి మొదలైందని చెప్పవచ్చు.

ఫైర్‌మెన్ కిషోర్ ఆత్మహత్య

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని చినభోగిల గ్రామానికిచెందిన గుడిమెట్ల కిషోర్ కుమార్ (33) బుధవారంరాత్రి తనఇంటిలో సీలింగు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందారు. ఎస్సై ఎం.రాజేష్ అందించిన వివరాల ప్రకారం పార్వతీపురంలోని అగ్నిమాపకదలంలో ఫైర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గుడిమెట్ల కిషోర్ వ్యక్తిగత కారణాలతో, కుటుంబ కలహాలతో, మధ్యంమానలేక, అప్పులు వల్ల బుధవారంరాత్రి 8గంటల ప్రాంతంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకోగా, కొద్దిసేపటి తర్వాత అతని భార్య సంధ్య చుట్టుపక్కలున్నవారు చూసి వెంటనే దించివేసి పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. మృతుని భార్య తెర్లాం కేజీబీవీలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వారికి ఒకపాప, బాబున్నారు.చినబోగిల గ్రామానికి చెందినకిషోర్‌కు తల్లి, ఇద్దరు అన్నయ్యలు, అక్కఉన్నారు. డిపార్ట్మెంట్ లోను, గ్రామంలోను మృతుడు కిషోర్‌కు మంచి పేరుంది. కిషోర్ మృతిని చినబోగిల గ్రామంలోని యువత జీర్ణించుకోలేకపోతున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. గురువారం సాయంత్రం స్వగ్రామం చినభోగిలలో అంత్యక్రియ నిర్వహించారు.

అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు సీజ్

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని బూర్జ, డి.శిర్లాంరేవుల నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న ఎస్సై ఎం.రాజేష్ సిబ్బందితో వెళ్లి వాటిని పట్టుకుని స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తీరు మార్చుకోండి... మున్సిపల్ కమీషనర్‌పై మంత్రి అగ్రహం

విశాలాంధ్ర-సాలూరు : సాలూరు పురపాలక సంఘ కార్యాలయాన్ని మంత్రి సంధ్యారాణి గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకముందు బాలికల ఉన్నత పాఠశాలను కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలన్న ఆశయంతో స్థల పరిశీలన చేసేందుకు కమీషనర్‌కి ఫోన్‌కాల్ చేసి రమ్మని పిలిచారు. ఆమె సకాలంలో స్పందించలేదు. దీనితో ఆకస్మికంగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. కమీషనర్ ప్రసన్నవాణిపై అగ్రహం వ్యక్తం చేశారు. ఐదురోజుల క్రితం మంత్రి కార్యాలయానికి పిలిచి సాలూరు పట్టణంలో ఉన్న పబ్లిక్ టాయిలెట్‌ల స్థితిగతులు తెలుసుకుని తక్షణమే వాటిని రిపేర్ చేసి తలుపులు, రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని పునరుద్ధరించాలని ఆదేశించారు. అయినప్పటికీ నేటికీ ఆపనులు కార్యరూపం దాల్చలేదు. పనులు చేపట్టడంలో అలసత్వం కనబరుస్తున్నారంటూ కమీషనర్‌పై అగ్రహం వ్యక్తం చేశారు. కమీషనర్ ప్రసన్నవాణి బదులిస్తూ ఏపనికి ఎంతఖర్చు అవుతుందో అంచనా విలువ (ఎస్టిమేషన్) వేయమని సిబ్బందికి సూచించానన్నారు. ఆ తరువాత టెండర్లకు పిలుస్తామన్నారు. దీనితో మరొకమారు ఆగ్రహించిన మంత్రి పనులు త్వరితగతిన పూర్తిచేయమంటే టెండర్లు పిలుస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. టాయిలెట్ మరమ్మత్తు పనులు పూర్తికాకుంటే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ పర్యటనలో ఆమె వెంట పట్టణ పార్టీ అధ్యక్షుడు నిమ్మాది చిట్టి, కౌన్సిలర్లు లక్ష్మోజీ, వైదేహీ, సీనియర్ నాయకులు డబ్బికృష్ణ, కొనిసి చిన్ని, వాడాడ శోభారాణి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహణ

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులకు తాడికొండ పిహెచ్‌సి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులు ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు అనారోగ్యం వాటిల్లితే వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యుగంధర్ ఉన్నారు.

ప్రవీణ్ ప్రకాష్‌ని విద్యాశాఖ తప్పించడంపై పీఆర్టీయూ హర్షం

విశాలాంధ్ర-బెలగాం : విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ని విద్యాశాఖ నుండి తప్పించి జీఏడికి రిపోర్ట్ చేయడాన్ని పిఆర్టీయూ ఆనందం వ్యక్తపరుస్తుందని పిఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ తెలిపారు. ఆయన విధానాల వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, ఆంగ్ల మాధ్యమం అంటూ రెండు భాషల్లో పాఠ్య పుస్తకం ముంద్రించి ఇవ్వడం వల్ల ఏ మాధ్యమం నేర్చుకోలేక తికమకకు గురిచేశారన్నారు. తన పర్యటనలో భాగంగా ఉపాధ్యాయులను ఒక విధంగా హింసించారని, చాలామంది అనారోగ్యం పాలయ్యారని, కలసి వాస్తవ పరిస్థితి చెప్పడానికి అవకాశమే ఇవ్వకుండా తనే నిజాయితీ పరుడిలా మిగిలిన వారిని అదోలా చూడడం జరిగిందని సూర్యనారాయణ అన్నారు. నిన్నటితో విద్యాశాఖకు పట్టిన శని వదిలిందని అన్నారు.

జంఝావతి ప్రాజెక్ట్ పూర్తయ్యేందుకు మంచి అవకాశం

విశాలాంధ్ర-కొమరాడ... దశాబ్దల కాలంగా ఒడిస్సా తో ఉన్న వివాదం వల్ల నిలిచిపోయిన జంఝావతి జలాశయం నిర్మాణం పూర్తికి చేయటానికి మంచి అవకాశం ఉందని టిడిపి బిజెపి జనసేన ఉమ్మడి నాయకులు అన్నారు. గురువారం జంఝావతి జలాశయాన్ని టిడిపి, బిజెపి జనసేన నాయకులు సందర్శించారు. ముందుగా జంఝావతి ప్రాజెక్టు, ప్రధాన కాలువలు పరిశీలించారు. ఈ సందర్భంగా టిడిపి అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకట నాయుడు, బిజెపి మన్యం జిల్లా అధ్యక్షులు ద్వారపూ రెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ జంఝావతి జలాశయం నిర్మాణానికి పక్క రాష్ట్రం ఒడిశా తో ఉన్న సమస్య పరిష్కరించుకోవడానికి మంచి అవకాశం వచ్చిందని అన్నారు. భవిష్యత్తులో జలాశయం ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేలు మంత్రులు కలుపుకొని సమస్యను వారి దృష్టిలో పెట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఎన్డీఏ కూటమి నాయకులు అన్నారు. ప్రస్తుతం ఒడిస్సా లో బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో పాటు ఆంధ్రలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున జంఝావతి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఒడిస్సా ప్రాంతంలో 1100 ఎకరాల భూమి ముంపు గురై నేపథ్యంలో అప్పటి ఒడిస్సా ప్రభుత్వం అంగీకరించకపోవడంతో ప్రాజెక్ట్ నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది అని తెలిపారు. ప్రస్తుతం మన్యం జిల్లాలోని నాలుగు మంది ఎమ్మెల్యేలను మంత్రులను ఎంపీలను కలిసి జంఝావతి ప్రాజెక్టు సమస్యను వారి దృష్టిలో పెట్టి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేలు మంత్రులు ద్వారా భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి అవసరమైన నిధులు మంజూరు కొరకు ముఖ్యమంత్రిని నారా చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని నాయకులు తెలిపారు. జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేందుకు జంఝావతి సాధన సమితి అని కమిటీని ఏర్పాటు చేసి పార్టీలకు అతీతంగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే మూడు నియోజకవర్గాల రైతులకు అలాగే పార్వతిపురం పట్టణానికి ప్రధాన సమస్య తాగునీరు తీరుతుందని ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఒడిస్సా ముఖ్యమంత్రిని అధికారులను ఆంధ్ర రాష్ట్ర తరఫున కలిసి ప్రాజెక్టు సమస్యను పరిష్కారానికి చర్యలు చేపడతామని అన్నారు. మన్యం జిల్లాలోనే పెద్ద సమస్యగా ఉన్న ఈ ప్రాజెక్టు సమస్యను ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్లి పరిష్కరిస్తే ఈ ప్రాంత రైతులు సస్య శ్యామలంగా రెండు పంటలు పండించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వాలు కనీసం ఈ ప్రాజెక్టు ప్రస్తావన లేకుండా పరిపాలన సాగించారని అన్నారు. కనీసం కాలువలు పూడికలు తీయడానికి కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడికక్కడ కాలువాల్లో చెత్త చెదారం తో పాటు పూడుకులు పేరుకు పోయాయని అన్నారు. ప్రతి ఖరీఫ్ రబీ సీజన్లో రైతులు సాగునీరు అందుతున్న ఆశపడ్డ రైతులందరికీ నిరాశ ఎదురైదని అన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ కు అవసరమైన మేరకు రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. జంజావతి జలాశయం పూర్తి అయితే పార్వతీపురం మన్యం చెలైలో సాగునీరు త్రాగునీరుకు కరువు ఉండదని అన్నారు. ముఖ్యంగా పార్వతీపురం పట్టణానికి అవసరమైన సాగునీరును ఈ జలశయం నుంచి సంపూర్ణంగా అందించేందుకు ఒక గొప్ప అవకాశం ఉందని అన్నారు. త్వరలో ఈ సమస్యను ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గులిపల్లి సుదర్శన్ రావు, నంగి రెడ్డి మధుసూదన్ రావు, గంగ రేకు వలస ఎంపిటిసి గంట వెంకట్ నాయుడు, పదాల హరిప్రసాద్, మారడాన తిరుపతి నాయుడు,బిజెపి మండల కన్వీనర్ ద్వారపు రెడ్డి సురేష్ కుమార్, సొండి సంజీవ నాయుడు, జనసేన పార్టీ నాయకులు గార గౌరీ శంకర్, మూడు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం ఎమ్మెల్యేను ఆదర్శంగా తీసుకోవాలి

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మన్యం జిల్లాలోని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను రాష్ట్రంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ఆదర్శంగా తీసుకోవాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల కృష్ణమూర్తి నాయుడు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మానవాళి మనుగడతోపాటు పశుపక్ష్యాదులు, జలజీవరాసుల ఉనికికి ఆధార భూతమైన చెరువులు, గెడ్డలు పార్వతీపురంలో కబ్జాకు గురైన విషయమై వాటిని రక్షిస్తానని ఎన్నికల ముందు ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గత రెండు రోజులుగా వరహాల గెడ్డ, బిళ్ళబంద, దేవుడి బంధ తదితర ఆక్రమణలకు గురైన ప్రాంతాల్లో పర్యటించి ఆక్రమణలు తొలగింపు చేయడం అభినందనీయ మన్నారు. ఎన్నికైన వెంటనే ప్రజలకు ఇచ్చిన మాటను నెరవేర్చే ఎమ్మెల్యే అభినందినీయులన్నారు.చెరువులు గెడ్డలు తదితర సాగునీటి వనరులు కబ్జా వలన తాగు, సాగు నీటికి ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే చెరువుల్లో కబ్జాలు తొలగించి వాటిని పరిరక్షించేందుకు నడుం బిగించిన పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ను దేశంలో రాష్ట్రంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్యేలు ఆదర్శంగా తీసుకొని వారివారి ప్రాంతాల్లో కబ్జాకు గురైన చెరువులను పరిరక్షించాలన్నారు. కబ్జాదారులకు చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు. కబ్జాకు గురైన సమయంలో పనిచేసే అధికారులను సైతం కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజాప్రతినిధులు ఇప్పుడు తీసుకునే ఈ చర్య భవిష్యత్ తరాలకు భరోసా ఇవ్వడమే అన్నారు. ఇప్పటికే చెరువులు కానరాక బెంగళూరు, ఢిల్లీ తదితర ప్రాంతాలతో పాటు ఆంధ్ర రాష్ట్రంలో సైతం పలు పట్టణాలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. సాగునీరు లేక రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. చెరువులు లేకపోవడంతో జలచక్రం జరగక, సకాలంలో వర్షాలు కురవక, భూగర్భ జలాలు అడుగంటి పోయాయన్నారు. ఇప్పటికే నీరు కొనుక్కునే పరిస్థితి ఉందన్నారు.చెరువుల పరిరక్షణకు ఇటువంటి తరుణంలో కంకణం కట్టుకున్న పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర ముమ్మాటికి అభినంద నీయులన్నారు. ఈ సందర్భంగా తమ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఆ సమితి రాష్ట్ర అధ్యక్షులు జాగారపు ఈశ్వర్ ప్రసాద్, కార్యదర్శి రఘు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణే లక్ష్యం

చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్

విశాలాంధ్ర-చింతపల్లి : సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరు రక్త పరీక్షలు (వైద్య పరీక్షలు) చేయించుకోవాలని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరిండెండెంట్ ఎస్ చంద్రశేఖర రావు అన్నారు. ఆర్ వి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతపల్లి ఆరోగ్య ఉపకేంద్రం ఏఎన్ఎం పెంట కుమారి ఆధ్వర్యంలో గురువారం సికిల్ సెల్ ఎనీమియా నిర్ధారణ రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలు ఉన్నవారు వారికి అందుబాటులో ఉన్న ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుంటే సికిల్ సెల్ ఎనిమీయాగా నిర్ధారణ అయితే ఆ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక మందులు అందజేస్తుందని, వాటిని రోగులు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం రోగులపై ఎంతైనా ఉందన్నారు. ఈ వ్యాధి ప్రబలిన వ్యక్తులు అనేక రకాలుగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. ఈ వ్యాధి నిర్ధారణ అయితే వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుండి ఆర్థిక ప్రోత్సాహకం అందుతున్నాయని ఆ ప్రోత్సాహకాలతో రోగులు సరైన సమయానికి మందులు తెప్పించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఉపయోగపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ సూపరిండెంట్ పద్మావతి, స్టాఫ్ నర్స్ దొంగబంటి రాణి, ఆశా కార్యకర్తలు సాగిన పద్మ, అప్పలమ్మ, గసాడి నాగ స్వర్ణేశ్వరి, ఎం మధులత, వంపురీరు లక్ష్మి, చల్లంగి ఓములమ్మ, జంప లోవ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు : మండల పరిధిలోనగల కిలగాడ పీహెచ్‌సిలో

సికిల్‌సెల్ ఎనిమియా (రక్తహీనత) వ్యాధి నివారణకు అవగాహన గూర్చి ర్యాలిని కిలగాడ పంచాయితీ కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి కిలగాడ కూడలి వరకు సికిల్ సెల్ వ్యాధిపై వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కిలగాడ పిహెచ్సి వైద్యాధికారిణి పి.శిరీష మాట్లాడుతూ రక్తకణాల సంఖ్య తగ్గడం,కళ్ళు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట మొదలైనవి సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాలని ఆమె చెప్పారు. ఇది వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమని, ఇవి మన రక్తంలో ఉత్పత్తికి కారణమయ్యే జన్యువులు లోపబూయిష్టంగా ఉంటాయని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరూ ఈవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఒ కె.సుబ్రహ్మణ్యం, హెచ్.ఎస్ బి.కృష్ణవేణిలతో పాటు ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

విశాలాంధ్ర-హుకుంపేట : మండల కేంద్రాంలోని స్థానిక తహాశీల్దార్ కార్యలయం వద్ద తహాశీల్దార్ పి.రవికుమార్ ఆద్వార్యంలో రెవిన్యూ దినోత్సవ వేడుకను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో తహాశీల్దార్ కార్యలయంలో గతంలో విధులు నిర్వహించి విశ్రాంతిలో ఉన్న సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతు ప్రభుత్వ శాఖల్లో రెవిన్యూ శాఖ అనేది కీలకమైన దని,రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు అనేక మేలు జరుగుతుందని అన్నారు. ఈ శాఖలో పని చేస్తున్న సిబ్బం ది ప్రజలకు ఇంకా మంచి సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకో వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కృష్ణారావు, సీనియర్ అసిస్టెంట్ మోహన్ రావు, ఆర్ ఐ సతీష్ అమ్మ, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లీలావతి, స్థానిక వీఆర్వో కొండబాబుతోపాటు తోటి రెవెన్యూ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం : గురువారం ఘనంగా రెవిన్యూడే వేడుకలు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవనాయుడు మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బందికి రెవిన్యూ డే శుభాకాంక్షలు తెలియజేసారు. రెవిన్యూ శాఖలో పనిచేయడం గర్వపడాల్సిన అంశమని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఎస్డిసి ఆర్ వి సూర్యనారాయణ మాట్లాడుతూ రెవిన్యూ శాఖలో పని నేర్చుకుంటే గుర్తింపు ఉంటుందని, శాఖకు సంబందించి ప్రతీ విషయాన్ని క్షుణంగా నేర్చుకోవాలని అన్నారు. శాఖకు ఉన్నటువంటి సామర్థ్యము, శక్తిని ప్రజలకు ఉపయోగపడే విధంగా ఉండాలని, ప్రజలకు రెవెన్యూ శాఖపై నమ్మకం కలిగే విధంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి వేణుగోపాలరావు, ఈఎఫ్‌జి-సెక్షన్ సూపరింటెండెంట్ చిన్నకృష్ణ, డి-సెక్షన్ సూపరింటెండెంట్ అవాల సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ చంద్రమౌళి, షేక్ ఇబ్రహీం, విఆర్ఓ జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ యం. సింహాచలం, విశ్రాంతి రెవిన్యూ అధికారులు మనోరబాయ్, నత్యనారాయణ, కామేశ్వరరావు, అప్పలనాయుడు, రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో... స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో గురువారం

రెవెన్యూ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహాశీల్దార్ అదప శ్రీనివాసరావు రెవెన్యూ డే ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ పప్పల చిట్టెమ్మ ఆర్ ఐ శ్రీనివాసరావు వీఆర్వోలు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు... అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తుమ్మల వి ఆర్ ఒ ముచిక సింగయ్యా ను రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఆయన సేవలను గుర్తించి రెవెన్యు డిపార్ట్మెంట్ సన్మానించారు. గూడూరు సర్పంచ్ మడివి బొజ్జ ,మాజీ ఎంపీటీసీ మడివి గౌరమ్మ కి అలాగే తోటి వీఆర్వోస్ చే ఆయనకి గాన సన్మానం మండలం లోని గూడూరు లో నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు చింతూరు మండల తాసిల్దార్ నజీముల్లాషా, రెవిన్యూ ఇన్స్పెక్టర్ బొద్దెల దేవయ్య , రెవిన్యూ ఉద్యోగులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఇంచార్జ్

తాసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్ జి.వి.ఆర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను గురించి ఆయన వివరించారు. అత్యవసర తుఫాన్, అగ్ని ప్రమాదాలు, వంటి సందర్భాలలో అందిస్తున్న సేవలు గురించి ఆయన వివరించారు. ఎన్నికల సమయంలో రెవిన్యూ శాఖ సేవలను అందిస్తుందని పలు రకాల ధ్రువీకరణ పత్రాలను అందించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ జిలాని, వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

విశాలాంధ్ర-చింతపల్లి: అన్ని శాఖలను సమన్వయం చేసుకునే ముందుకు సాగే శాఖ రెవెన్యూ శాఖ అని తహాశీల్దార్ కే రామకృష్ణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో గురువారం రెవెన్యూ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీడీవో వీర సాయిబాబా, తెదేపా, జనసేన పార్టీల నాయకులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు, రెవెన్యూ ఉద్యోగులతో కలసి ఆయన కేక్ కట్‌చేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ సేవలపై వివరిస్తూ ప్రసంగించారు. సకల జీవులు సంతోషంగా జీవితం సాగించేందకు రెవెన్యూ వ్యవస్థ ప్రత్యేక పాత్ర పోషిస్తుందన్నారు. రెవెన్యూ సేవలను గిరిజనులకు మరింత చేరువ చేసేలా తమ శాఖలోని ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రెవెన్యూశాఖ విశ్రాంత ఉద్యోగులను వివిధ పార్టీల, వర్తక సంఘం నాయకులు, ఐసిడిఎస్ ఏసిడి పిఓ రామలక్ష్మి, సూపర్వైజర్ విజయకుమారి, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కే పూర్ణచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు, చల్లంగి లక్ష్మణరావు, లక్కోజు నాగభూషణం, ఏనుగుల సత్యనారాయణ, జనసేన నాయకుడు వంతల బుజ్జిబాబు వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేటి జోగేశ్వరరావు, పెద్దిరెడ్డిల బేతాళుడు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మొట్టడం కృష్ణమూర్తి, వీఆర్వోలు ఎస్.కృష్ణారావు, టి.సోమలింగం, ఎన్.సావిత్రి, వి.సత్యామణి, నాగమ్మ, తులసి, అన్ని పంచాయతీల వీఆర్వోలు, అధిక సంఖ్యలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని కలసిన జోగారావు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం మాజీ సిఎం శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో పాల్గొన్న పార్వతీపురం నియోజక వర్గ మాజీ శాసనసభ్యులు అలజంగి జోగారావు సమావేశం అనంతరం మాజీ సిఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డిని గౌరవ పూర్వకంగా కలిశారు.ప్రజల పక్షాన పోరాడి, కార్యకర్తలకు అండగా నిలిచిన ధైర్యంగా ముందుకు వెళ్ళమని చెప్పి భరోసాను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా మాజీ ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

వరదలకు సంబంధించి బఫర్ స్టాక్ తక్షణమే భాదితులకు అందుబాటులో ఉంచాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : శబరి గోదావరి నదుల వరదలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని ముంపుకు గురయ్యే గ్రామాల ప్రజలకు అందుబాటులో బఫర్ స్టాక్ ఉంచాలని,వరద సమన్వయ కమిటీలు ఏర్పాటు చేసి వరద బాధితులకు పూర్తి న్యాయం జరిగేవిధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని సి.పి.యం మండలకమిటీ డిమాండ్ చేసింది. గురువారం పెద్దమట్టపల్లిలో జరిగిన మండలస్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశంలో జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబులు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వలన ప్రతీ సంవత్సరం నిర్వాసితులు మునిగి తేలాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కారు చీకట్లో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వరదల సమయంలో జీవనం సాగిస్తున్నారని అన్నారు. బాధితులను ఆదుకోవటం కొరకు ముందుగానే ప్రణాళికా బద్ధంగా వరదల్లో సహాయ,సహకారాలు అందించాలని, రూట్ బంద్ అయ్యే గ్రామాలలో బోట్లు, మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.మండల కేంద్రం రేఖపల్లిలో బాధితులకు పునరావాసం,త్రాగునీరు అందించాలని అదేవిధంగా మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. వరదల్లో బాధితులకు కూరగాయలు తదితర సామాన్లు, నిత్యావసరాలు తీసుకురావటానికి వీలుగా చింతూరు నుంచి కన్నులూరు మీదుగా కుందులూరు వరకు రోడ్డు మార్గం గతంలో ఉండేది దానిని మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో తుర్రం బాబూరావు అధ్యక్షత వహించగా మండల నాయకులు పులి.సంతోష్ కుమార్, కుంజ నాగిరెడ్డి, వర్ధాది రమేష్, తోడం రాజు, కదల కొండారెడ్డి, పొడియం శ్రీరామ్మూర్తి, అసు లక్ష్మయ్య, చిక్కాల రామారావు, కారం సత్తిబాబు, శ్రీరపు తాతబాబు, గుండిపూడి లక్ష్మణ్‌రావు, కమ్మచిచ్చు సత్యనారాయణ, సోడి మల్లయ్య, అచ్యుత్‌రావు, కన్నారావు, ఖాదర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి తాళం, భజన పోటీలో విజేతలకు బహుమతుల ప్రదానం

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని లక్ష్మీపురంగ్రామంలో గురువారంనాడు మండలస్థాయి తాళం భజనపోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు.శ్రీసాయిమండలి భజన సమాజం ఆర్గనైజర్ చప్ప వెంకటరమణ,గ్రామప్రజలు, పెద్దలు, సభ్యులు సహకారంతో ఈపోటీలు నిర్వహించారు. ఈపోటీలో బలిజిపేట మండలం గళావిల్లి, సీతానగరం మండలం లక్ష్మిపురం, బొబ్బిలి మండలం శివరాం పురం గ్రామాల భజన మండల్లు ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. న్యాయ నిర్ణయితలుగా కే.రామకృష్ణ, ఎస్.లక్ష్మీనారాయణ, జి.సూర్యనారాయణ, ఏరామకృష్ణ, సిహెచ్ ఎల్లన్నాయుడు, కృష్ణాజీలు వ్యవహరించినట్లు తెలిపారు. ఆర్గనైజరు చప్ప వెంకటరమణ, కోక్కరి సింహాచలం, గవర శంకరరావు దగ్గరుండి కార్యక్రమాలను నిర్వహించారు.

దివ్యాంగుల పెన్షన్ పెంపుపై హర్షం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : ఇటీవల అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వం దివ్యాంగుల పెంక్షన్ పెంపుదల చేయడం పై హర్షం వ్యక్తం చేస్తూ పార్వతీపురం మన్యం జిల్లా దివ్యాంగుల సంఘం సభ్యులు గురువారం శాసన సభ్యులు బోనెల విజయ్‌చంద్రను కలసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కందిశ రమేష్ ప్రెసిడెంట్ సెక్రటరీ చందాపు గంగయ్య, ట్రెజరర్ సురేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యంగుల పెన్షన్ 3000 నుండి 6000 వేలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని సంతోషించి తెలుగుదేశం ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉన్నందుకు భవిష్యత్తులో మరింత భరోసా కల్పించారని కోరారు.

జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : డిఎంఓ

విశాలాంధ్ర-కొమరాడ... జ్వరాలపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి డిఎంఓ డాక్టర్ టి జగన్మోహన్రావు రానున్న వర్షాకాలంలో ప్రతి గ్రామంలో జ్వర లక్షణాలు గుర్తించిన ప్రతీ ఒక్కరికీ సత్వరమే నిర్ధారణ పరీక్షలు క్షేత్ర స్థాయిలోనే జరపాలని జిల్లా మలేరియా అధికారి(డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహన్ రావు ఆదేశించారు. చినఖేర్జల గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు.జ్వర లక్షణాలతో ఉన్న వారికి నిర్వహించిన మలేరియా ఆర్డిటి నిర్ధారణ పరీక్షలు,ఫలితాలను పరిశీలించారు. రిజల్ట్ నెగెటివ్ గా నిర్ధారణ అయిన వారికి ఆరోగ్య సమస్యలకు తగు మందులు అందజేయాలన్నారు.రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను డిఎంఓ తెలుసుకున్నారు.ప్రస్తుతం సీజనల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వైద్యాధికారి,వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని,సరైన గుర్తింపు లేని వైద్యాన్ని ఆశ్రయించవద్దని స్థానికులకు సూచించారు.జ్వర లక్షణాలున్న వారికి సేకరించిన రక్త పూతలు(స్లైడ్స్) సకాలంలో ల్యాబ్ లో పరీక్షలు జరగాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. మలేరియా గా గుర్తిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. గ్రామంలో త్రాగునీరు స్వచ్ఛత పరీక్షలు ఎప్పటికప్పుడు జరపాలన్నారు.దోమల లార్వా స్థావరాలు ఎక్కడైనా ఉన్నాయా అని పరిశీలించారు.సీజనల్ వ్యాదులు,జాగ్రత్తలు పట్ల స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ విజయకుమారి, సూపర్వైజర్ జయగౌడ్,వైద్య సిబ్బంది అనిల్,మంగమ్మ,రమేష్, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిచెరువులో నిర్మించిన విల్లాలు, పక్కా ఇళ్లపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నెల్లి చెరువులో ఆక్రమించి నిర్మించిన విల్లాలు, పక్కాఇళ్ళ ను పరిశీలించి అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ పట్టణ నాయకులు గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు డిమాండ్ చేశారు. గురువారం నెల్లి చెరువు ప్రాంతంలో నిర్మించిన నూతన భవనాలను వారు పరిశీలించారు.ఈ సందర్భంగానాయకులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా నెల్లి చెరువులోపేదలు పాకలు, రేకు ఇళ్లు కట్టుకొని జీవనం సాగిస్తూ పట్టణంలో కూలి పనులు చేసుకుని జీవిస్తుంటే అటు మునిసిపల్ అధికారులు ఇటు రెవిన్యూ అధికారులు పేదలపై జులుం చేసి బలవంతంగా పాకలు పీకి వేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, కానీ గత వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉండగా మాజీ ఎమ్మెల్యే అండదండలతో కొంతమంది పెద్దలు, ప్రభుత్వ ఉద్యోగస్తులు, పెత్తందారులు పక్కా ఇల్లు , అతి పెద్ద విల్లాలు కట్టుకున్న అటు రెవిన్యూ అధికారులు కానీ ఇటు మునిసిపల్ అధికారులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా నెల్లిచెరువు మొత్తాన్ని సర్వే చేసి ఎవరైతే అర్హత ఉన్న పేదలు ఉన్నారో వాళ్ళందరికీ పట్టాలిచ్చి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అర్హత లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు, పెత్తందారులు, భూస్వాములు కట్టుకున్న విల్లాలని, పక్కాయిల్లును వెంటనే తొలగించి పేదలకు న్యాయం చేయాలని లేకపోతే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే బోనెల. విజయ్ చంద్ర దృష్టి సారించి పేదలకు పట్టాలు ఇప్పించి పక్కా ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో అక్రమంగా కట్టుకున్న, గవర్నమెంట్ ప్రభుత్వ ఉద్యోగులు ఇతర పెత్తందారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీలకు సకాలంలో రెవెన్యూ పనులు చేసి పెట్టండి

ఐటిడిపి కోఆర్డినేటర్ పవన్

విశాలాంధ్ర-సీతంపేట : రెవెన్యూ దినోత్సవం సదర్భంగా గోయిధి గ్రామంలో రెవెన్యూ అధికారులు ప్రజలకు రెవెన్యూ సేవలు పై అవగాహన సమావేశం నిర్వహించటం జరిగింది. అందులో భాగంగా ప్రజలను, రెవెన్యూ అధికారులను ఉద్దేశించి ఐటిడిపి నియోజకవర్గం కోఆర్డినేటర్ ఇమరక పవన్ మాట్లాడుతు గిరిజనులను ఉద్దేశించి రెవెన్యూ సిబ్బందికి కొన్ని సూచనలు ఇవ్వటం జరిగింది. గిరిజనులు ఏ పనిమీద వచ్చిన ఆపని 24 గంటల వ్యవధిలో పూర్తి అయ్యేలా చొరవ తీసుకోవాలి, అవ్వనిపక్షంలో ఎందుకు జాప్యం జరుగుతుందో అర్థమయ్యేలా వారికి వివరించాలని తెలిపారు. సీతంపేట మండలంలో ఆదివాసీలు తమ సొంత పనుల నిమిత్తం ఎమ్మార్వో కార్యాలయం మరియు ఎంపీడీవో కార్యాలయము, సచివాలయంకు ఎక్కువగా వస్తారని ఆ తరుణంలో సిబ్బంది త్వరగా వారి పనులు చేసి పెట్టాలని, సిబ్బందికి దిశ నిర్దేశం చేయటం జరిగింది. పోడు పట్టాలు, అదంగల్ రేషన్ కార్డులు కోసం రెవెన్యూ డిపార్ట్మెంట్ నుండి గ్రీవెన్స్ నిర్వహిస్తే బాగుంటది అని ఈ సందర్భంగా కోరటం జరిగింది. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో గీతాంజలి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

విశాలాంధ్ర-సీతానగరం... మండలంలోని లచ్చయ్యపేట గ్రామంవద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. తామరకండి గ్రామానికి చెందిన డోకల నారాయణరావు, యాములపల్లి శ్రీరాములనాయుడులు బొబ్బిలి నుండి సీతానగరం వస్తుండగా పార్వతిపురం నుండి బొబ్బిలి వైపు వెళ్తున్న వాహనదారుడు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు ఈప్రమాదంలో నారాయణరావుకు తీవ్రగాయాలు కావడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించగా, శ్రీరాములునాయుడును పార్వతీపురం ఆసుపత్రికి తరలించారు.